క్లుప్తంగా

రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్

సి.బెళగల్: జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన భూముల రీసర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. ఆదివారం ఆయన డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తితో కలిసి బురాన్‌దొడ్డిలో సర్వే సహాయకుడు రాజశేఖర్ నిర్వహిస్తున్న సర్వేను తనిఖీచేశారు. సర్వేపై సూచనలు చేసి భూ రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో తహసీల్దార్ మాట్లాడుతూ భూముల రీ సర్వేతో భావితరాలకు సమస్యలు లేకుండా ఉంటుందని, ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేత

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుండి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపేసినట్లు ఆదివారం డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో ప్రస్తుతం 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

సన్మానం



అబ్దుల్ కలామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కోడుమూరు : కోసిగి మండలంలోని డి.బెళగల్ హైస్కూల్ హెచ్ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై నంద్యాల జిల్లా, కొలిమిగుండ్ల ఎంఈఓగా వెళ్తున్న కోడుమూరుకు చెందిన ఉపాధ్యాయుడు అబ్దుల్ కలామ్‌ను 10వతరగతి బ్యాచ్ పూర్వపు విద్యార్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు. అబ్దుల్ కలామ్ భవిష్యత్‌లో మరిన్ని పదవులు అలంకరించాలని ఈ సందర్భంగా కోడుమూరు జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, పత్తికొండ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ రఘురామిరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తిప్పయ్య, దేవదాస్, రామక్రిష్ణ, శశిధర్‌రెడ్డి, మల్లారెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, సత్యం, సతీష్‌కుమార్, శంకర్, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జగనన్న సురక్ష సదస్సులు

సి.బెళగల్: మండలం పరిధిలోని గ్రామాలలో మంగళవారం నుంచి జగనన్న సురక్ష సదస్సులను నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ రాముడు ఆదివారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం పోలకల్ గ్రామం సచివాలయం -1, 2 సంతబజార్ ఆవరణలో సదస్సు జరుగుతుందన్నారు. అలాగే బుధవారం ఉదయం పోలకల్ గ్రామ సచివాలయం – 3లో, మధ్యాహ్నం ఇనగండ్ల గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని, 11 రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదానికి గురైన వేణుగోపాల్

ఓర్వకల్లు: కర్నూలు–బేతంచెర్ల రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటన వివరాల మేరకు బేతంచెర్ల మండలం, సీతలాపురం గ్రామానికి చెందిన తెలుగు వేణుగోపాల్ కర్నూలు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ప్రొద్దుటూరు నుంచి కర్నూలు వైపు వస్తున్న ఆర్‌టీసీ బస్సు వెంకటాపురం మలుపు రోడ్డు వద్ద బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వేనుగోపాల్ తల, ముఖంపై తీవ్ర రక్త గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతానికి అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. బాధిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పాణ్యం: రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు కోరారు. ఆదివారం స్థానికంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ ఎరువులు, విత్తనాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై దృష్టి సారించాలని, మరిన్ని రాయితీలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, మండల కార్యదర్శి భాస్కర్, ఖాసీం, మహేశ్వరరెడ్డి, నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్ర‘జల’ కష్టాలకు చెక్ !

- జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయి
- కోడుమూరు నియోజకవర్గానికి రూ.10.78 కోట్లు విడుదల
- పైప్‌లైన్లు, కుళాయి పాయింట్ల ఏర్పాటుకు లైన్‌క్లియర్
- తీరనున్న మంచినీటి ఇబ్బందులు

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. ఏళ్లతరబడి నెలకొన్న నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపట్టింది. జలజీవన్‌మిషన్ పథకంతో నీటి కష్టాలు తీరనున్నాయి. ఈ నేపథ్యంలో కోడుమూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు పూర్తి పరిష్కారం లభించనుంది. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ పనులకు సంబంధించి హైదరాబాద్‌కు చెందిన జిట్టా రమణారెడ్డి కాంట్రాక్ట్ దక్కించుకుని అగ్రిమెంట్ పూర్తి చేసుకున్నారు. దీంతో లైన్ క్లియర్ అయ్యింది. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో జలజీవన్‌మిషన్ కింద ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరయ్యాయి. మొదటి విడతలో రూ.10.78 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులతో ఎంపిక చేసిన గ్రామాల్లో కొత్తగా బోర్లు ఏర్పాటు చేసి ఓవర్ హెడ్‌ట్యాంకులు నిర్మించి వీధుల్లోకి కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇంటింటికీ కుళాయి అమర్చి సురక్షితమైన మంచినీటి సరఫరా చేయనున్నారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో జలజీవన్‌మిషన్‌కు సంబంధించి రూ.40లక్షలతో 90వేల లీటర్లలో ఓహెచ్ఎస్ నిర్మాణం నిర్మాణం చేపట్టారు.



జేజేఎం నిధులు రూ.40లక్షలతో ఉల్చాలలో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకు

మండలాల వారీగా మొదటి విడత ఎంపికైన గ్రామాలు

- కర్నూలు మండలానికి జలజీవన్ మిషన్ కింద రూ.2.3 కోట్లు ప్రభుత్వ మంజూరు చేసింది. అధికారులు తులశాపురం, బసవపురం, జి శింగవరం, నిడ్జూరు, గొందిపర్ల, దేవమాడ, దిగువపాడు, ఉల్చాల గ్రామాలను ఎంపిక చేశారు.
- కోడుమూరు మండలానికి రూ.4.23 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మండల కేంద్రం కోడుమూరుతోపాటు కల్లపరి, పులకుర్తి, రామచంద్రాపురం, బైన్‌దొడ్డి, లద్దగిరి, గోరంట్ల, అమడగుంట్ల గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు.
- గూడూరు మండలానికి సంబంధించి రూ.1.7 కోట్ల కేటాయింపు జరిగింది. మొదటి విడతలో కుళాయి, పైప్‌లైన్ నిర్మించేందుకు బూడిదపాడు, పెంచికలపాడు, మునగాల గ్రామాలను ఎంపిక చేశారు.
- సి బెళగల్ మండలానికి సంబంధించి రూ.10.78 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. సంగాల, బురాన్‌దొడ్డి, ముడుమాల, పోలకల్ గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించి మొత్తం రూ.8.2555 కోట్ల నిధులతో ఆయా గ్రామాల్లో ‘ప్ర’జల’ కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

త్వరలో పనులు ప్రారంభం



జలజీవన్ మిషన్ కింద నియోజకవర్గానికి రూ.10.78 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నాలుగు మండలాల్లోని కొన్ని గ్రామాలను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. త్వరలోనే జలజీవన్‌మిషన్ కింద ఆయా గ్రామాల్లో పనులను ప్రారంభిస్తాం. ఇంటింటికీ సురక్షితమైన మంచినీరు అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం. డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేసేందుకు సమాయత్తం అవుతున్నాం.

– కె రంగస్వామి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్, కర్నూలు మండలం

ఆపదలో ప్రాణాలు కాపాడారు....

కరోనా మహమ్మరి విజృంభించిన సమయంలో అయినవారు దగ్గరికి రాలేని పరిస్థితి. ప్రభుత్వం నియమించిన వలంటర్‌లు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలు సేవలు చేశారు. సొంత కుటుంబ సభ్యులను కూడా పక్కన బెట్టి ప్రజల కోసం తపించిన వలంటీలు సేవలు వర్ణించలేనివి. కరోనా బారీన పడిన వారి ప్రాణాలు కాపాడారు. చివరకు చనిపోయిన వారికి కూడా బంధువులు రాలేనిపరిస్థితుల్లో అంత్యక్రియలు నిర్వహించి అంకితభావాన్ని చాటుకున్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు చేసిన సేవలను ప్రజలు నేటీకి గుర్తు చేసుకుంటున్నారు ప్రజలు. – పాణ్యం



కరోనా బారినపడిన వారిని 108వాహనంలో ఎక్కిస్తున్న దృశ్యం (ఫైల్)

ధైర్యం చెప్పి.. భరోసా కల్గించారు



కరోనా సమయంలో వలంటరీలు చేసిన సేవలు అన్ని ఇన్ని కావు. కరోనాకు బయపడి ఎవ్వరు బయటికి రాలేని పరిస్థితి నెలకొన్న సమయంలో వలంటర్‌లు అండగా నిలిచారు. ఏ చిన్న సమస్యను చెప్పిన తక్షణమే స్పందించి సేవలు అందించారు. కరోనాను లెక్కచేయకుండా మందులు, కూరగాయలు, నిత్యావసర సరుకులను అందించారు. పింఛన్ వచ్చిందంటే తెల్లవారకముందే సొమ్ము అందజేశారు. బంధువులు, కుటుంబ సభ్యుల కంటే వలంటర్‌లు చేసిన సేవలు గుర్తుండిపోతాయి. – ఆర్ వెంకట సుబ్బమ్మ

కష్టకాలంలో అండగా...

ఈ ఫొటోలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న మండల కేంద్రం గడివేముల వలంటీర్ శ్రీధర్. కరోనా లాక్‌డౌన్ సమయంలో తన పరిధిలోని కుటుంబాలకు అండగా నిలిచాడు. బయటకు రాలేని పరిస్థితుల్లో ప్రభుత్వ ఆర్థిక సాయంతోపాటు దాతల నుంచి సేకరించిన నిత్యావసర సరుకులను తలపుతట్టి అందజేశారు. అందరికీ అందుబాటులో ఉంటూ ఆరోగ్య సమస్యలు తెలుసుకుంటూ భయపడొద్దంటూ మనోధైర్యాన్ని నింపాడు. ఏ మాత్రం ఆరోగ్య పరిస్థితుల భిన్నంగా కనిపించినా వెంటనే కరోనా పరీక్షలు చేయించి ఆదుకున్నాడు. వలంటీర్లు చేసిన సేవలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు ప్రజలు. – గడివేముల



కరోనా సమయంలో గడివేములలో పొలం వద్ద పనిచేసకుంటున్న పెద్ద మాబున్నీకి పింఛన్ సొమ్మును అందిస్తున్న వలంటీరు శ్రీధర్

సంతోషంగా ఉంది



వలంటీర్ల సేవలు అందరికీ అందుతున్నాయి. ప్రత్యేకించి కరోనా సమయంలో వలంటీర్లు సేవలకు వెలకట్టలేం. మా విషయానికొస్తే కరోనా విజృంభించిన సమయంలో బంధువులు కూడా రాని పరిస్థితి. అయితే మా వలంటీరు ఇంటి వద్దకు వచ్చి మా కుటుంబ సంక్షేమం గురించి అడిగి తెలుసుకోనేవాడు. ఆరోగ్య సూత్రాలు వివరించి మనోధైర్యం కల్పించాడు. కరోనా కొంతమేర తగ్గాక పొలం పనులు చేసుకుంటున్నా అక్కడి వచ్చి సూచనలు చేశాడు. పింఛన్ సొమ్ము కూడా అందజేసి అండగా నిలిచాడు. వలంటీర్ల సేవలను తప్పుపట్టడం అన్యాయం. – పెద్దమాబున్నీ, గడివేముల

ఘనంగా కార్మెల్ మాత మహోత్సవం



చెట్లమల్లాపురంలో కార్మెల్ మాత మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: చెట్లమల్లాపురం గ్రామంలో కార్మెల్ మాత మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహోత్సవంలో భాగంగా సాయంత్రం కార్మెల్ మాత(మేరిమాత)ను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని కార్మెల్ మాత చర్చిలో పండుగ దివ్య పూజాబలి సమర్పించారు. ఫాదర్లు సి.దేవదాసు, లహ్రాస్తాయ, జాన్ బ్రిట్టో శుభసందేశం చేశారు. కార్మెల్ కొండపై దర్శనమివ్వడంతో మేరిమాతను కార్మెల్ మాతగా పిలుస్తారని తెలిపారు. పండుగ మహోత్సవానికి కర్నూలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి విశ్వాసులు తరలివచ్చారు.



శుభసందేశం ఇస్తున్న ఫాదర్లు

నేడు బస్తిపాడు, పుసులూరులో జగనన్న సురక్ష

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు, పుసులూరు గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. ప్రజలు జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జోరుగా టెంకాయ మొక్కలకు పునాదులు

కోడుమూరు రూరల్ : మండల పరిధిలోని ముడుమలగుర్తిలో టెంకాయ చెట్టు నాటే పునాది పనులు జోరుగా సాగుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో 42మంది రైతులకు పొలాల్లో నాటుకునేందుకు టెంకాయ, మామిడి, చీని, దానిమ్మ, నేరేడు మొక్కలను పంపిణీ చేసినట్లు ఈసీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సరఫరా చేసిన మొక్కలు నాటేందుకు ఉపాధి కూలీలు పునాదులు తీస్తున్నారు. మండలంలోని పులకుర్తి, లద్దగిరి, కోడుమూరు, అమడగుంట్ల, అనుగొండ, వర్కూరు, ప్యాలకుర్తి గ్రామాలకు చెందిన మొత్తం 86మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 42మంది రైతులకు ఎకరాకు టెంకాయ 60మొక్కలు, మామిడి 70, దానిమ్మ 267, చీని 100, నేరేడు 20 మొక్కల చొప్పున పంపిణీ జరిగింది. పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు ముందుకొచ్చిన రైతుల పొలాల్లో కూలీల చేత పాదులు తీయించడంతో పాటు, నీటి తడులకయ్యే ఖర్చులను ఇవ్వడం జరుగుతుందని ఈసీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.




టెంకాయ మొక్కలు నాటేందుకు పాదులు తీస్తున్న ఉపాధి కూలీలు

జీఎస్టీపై అవగాహన అవసరం

కర్నూలు (టౌన్) : ఆదాయ పన్ను, జీఎస్టీ (వస్తు సేవల పన్ను) చట్టాలపై అవగాహన అవసరమని తిరుపతికి చెందిన సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ డాక్టర్ ఫల్గుణకుమార్ వెల్లడించారు. ఆదివారం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని స్కంధాన్ని భవన్‌లో క్రెడాయ్ (కాన్ఫడరేషన్ రియల్ ఎస్టేట్ అండ్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఆదాయపు పన్ను, జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చట్టంలో ఉన్న పరిమితులను, అందులో ఉన్న క్లిష్టమైన సమస్యలపై పూర్తిగా తెలుసుకొవాలన్నారు. అలాగే ట్యాక్స్ ప్రాక్టీసనర్స్, వ్యాపారులు, బిల్డర్స్ అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. అనంతరం క్రెడాయ్ ఆధ్వరయంలో చార్టర్డ్ అకౌంటెంట్‌ను ఘనంగా సత్కరించారు.

కళాకారుడికి రిటైర్మెంట్ లేదు

కర్నూలు కల్చరల్: కళాకారుడికి రిటైర్మెంట్ లేదని పూర్వపు కలెక్టర్ గుమ్మళ్ల బలరామయ్య అన్నారు. ఏపీఈడబ్ల్యూఐడీసీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సంగా ఆంజనేయులుకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా బలరామయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి వృత్తి జీవితంలో పదవీ విరమణ ఉంటుందేమో కానీ కాళాకారుడికి ఊపిరి ఉన్నంత వరకూ రిటైర్మెంట్ ఉండదన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షతన సంగా ఆంజనేయులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాకారులు ఇనాయతుల్లా, మహమ్మద్ మియ్యా, క్రిష్ణఫర్, రాజారత్నం, అంకయ్య, యాగంటీశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.



జోరుగా కంది సాగు !

మండలంలో శనివారం రాత్రి 9.4మి.మీ వర్షం కురియడంతో ఖరీఫ్ సాగుకు కొంత మేర జీవం పోసినట్లైంది. నెలరోజుల కిందట కురిసిన వర్షాలకు మండలంలో రైతులు పత్తి, కొర్ర, వేరుశనగ, పొద్దుతిరుగుడు తదితర పంటలను సాగు చేశారు. పంటలు సాగు చేసినప్పటి నుంచి చిన్నపాటి వర్షాలు తప్ప మండలంలో భారీ వర్షాలు కురియలేదు. దీంతో సాగు విస్తీర్ణం పెద్దగా పెరగలేదు. అయితే గత రెండు రోజుల నుంచి కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు మండలంలోని ప్యాలకుర్తి, వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, ఎర్రదొడ్డి గ్రామాల్లో ఎర్రనేలల్లో రైతుల్లో కంది సాగు జోరుగా సాగుతుంది.

–కోడుమూరు రూరల్

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మీదివేముల గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు ఆదివారం కొనసాగింది. మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఊరువాకిలి, ఓసీ కాలనీ, బోయ వీధి, చాకలి పేటలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. సుమారు 220 గృహాలను సందర్శించి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాలు అందాయా.. లేదాని అని లబ్ధిదారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యం అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు చేసిన మోసానికి పొదుపు మహిళలు ఎంత నష్టపోయారో గమనించుకోవాలని గుర్తు చేశారు. ఓట్ల కోసం మాటలు చెప్పే పచ్చనాయకుల మాటలు నమ్మొద్దని సూచించారు. మీదివేముల ప్రజలు చేసిన సాయం ఎప్పటికీ మరువనన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, మండల ఉపాధ్యక్షుడు పద్మనాభరెడ్డి, సచివాలయ మండల కన్వినర్ లోటర్ బాషా, స్థానిక నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రమేష్‌నాయుడు, గొల్ల కిష్టయ్య, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

నేడు స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

గూడూరు: స్థానిక రెవిన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ శివశంకర్ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ప్రకటనలో సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే స్పందనకు అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం సచివాలయం-3పరిధిలో సోమవారం గడపగడపకు–మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు. అధికారులు, వలంటీర్లు కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు సమీపంలో రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను వెనుక వస్తున్న కారు అధిగమించబోయి ఢీకొంది. ట్యాంకర్‌ను డ్రైవర్ అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. హైవే పెట్రోల్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

18న కర్నూలు మండల సర్వసభ్య సమావేశం

కర్నూలు (న్యూటౌన్): జెడ్పీలోని కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 18న ఉదయం 10.30గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎంపీడీఓ కేఏ అజాంఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

దేశ, ధర్మ రక్షణలో ముందుండాలి

కర్నూలు కల్చరల్: ధర్మ రక్షణలో భజరంగ్ దళ్ ఎల్లప్పుడూ ముందుంటుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకటరామయ్య అన్నారు. ఆదివారం ఓల్డ్‌సిటీలోని బాలసాయిబాబ మందిరంలో వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ, ధర్మ రక్షణలో భజరంగ్ దళ్ కార్యకర్తలు ముందుండాలన్నారు. హిందూ సమాజ సంఘటనకు భజరంగ్ దళ్ అనేక సేవా కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన వివరించారు.

20న ‘మానవత’ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కర్నూలు కల్చరల్: మానవత స్వచ్ఛంద సంస్థ కర్నూలు నగరం యూనిట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఈనెల 20వ తేదీ నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వీఆర్‌కాలనీలోని సంస్థ కార్యాలయంలో సంస్థ సభ్యుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవలను మరింత విస్తృతం చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈనెల 20న సాయంత్రం 4.30 గంటలకు సంస్థ కార్యాలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. సంస్థ ఫౌండర్, రాష్ట్ర కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమానికి సంస్థ సభ్యులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంస్థ సభ్యులు పాటిల్ హనుమంతరెడ్డి, యుగంధర్ శెట్టి, రమణ, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.



పచ్చదనం... కనువిందు!

ఓ రైతు పొలంలో ఉల్లి నారుమళ్ల పచ్చదనం కనువిందు చేస్తుంది. కనుచూపుమేర భూమి పచ్చగా కప్పేసినట్లు కనిపిస్తున్న దృశ్యం ఆకట్టుకుంటుంది. కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రహదారిలో ప్యాలకుర్తి గ్రామం వద్ద ఓ రైతు పొలంలో పోసిన ఉల్లి నారుమళ్లు పచ్చదనంతో కలకలాడుతుంది. ఉల్లి పంట సాగు చేసే రైతులు ముందుగా నీటివసతి ఉన్న చోట ఉల్లి విత్తనాలను నారుమళ్లుగా వేసి పెరిగాక పొలాల్లో నాటుకుంటారు. కొంతమంది రైతులు ఉమ్మడిగా ఓ రైతు పొలంలో పోసిన ఉల్లినార మొలకెత్తి పచ్చగా కళకళలాడుతోంది. ఆ రోడ్డు వెంట వెళ్లే వారిని ఈ పచ్చదనం ఇట్టే కట్టిపడేస్తోంది.

–కోడుమూరు రూరల్